

ఉపాధి కల్పనకు కార్యాచరణ

యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. 10లో▸



ఖోఖో పోటీలకు విద్యార్థులు

43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ పరమేష్ శనివారం తెలిపారు. 10లో▸



రుద్రాక్ష, విభూతి ఇచ్చి..

సాధువుల వేషధారణతో వచ్చిన నలుగురు ఓ రిటైర్డ్ టీచర్‌కు రుద్రాక్ష, విభూతి ఇచ్చి బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లారు. 10లో▸

న్యూస్‌రీల్

ఆరో రోజు ప్రశాంతం



కేజీరెడ్డి కళాశాల కేంద్రంలో పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: గ్రూప్–1 పరీక్షలు ఆరో రోజు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పర్యవేక్షించారు. కేజీరెడ్డి కళాశాలలోని 31వ పరీక్ష కేంద్రంలో 600 మంది అభ్యర్థులకుగాను 359 మంది, 32వ పరీక్ష కేంద్రంలో 600 మందికి 349 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సక్సెస్ చేద్దాం

పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కొందుర్గు: రాష్ట్రంలోని కార్మిక, కర్షకులు ఈనెల 31న నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లేడ్ చౌదరిగూడలోని ఆర్యవైశ్య సమాజం దగ్గర ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు రమేశ్, వెంకటేశ్, చిన్నయ్య, కృష్ణ, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్




పవన్ చౌహాన్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన 'చలో సెక్రటేరియేట్'కు షాద్‌నగర్ నుంచి పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిని అణగదొక్కేందుకు అరెస్టులు చేయించడం సరికాదన్నారు.



రూపాయి.. పెళ్లోయి



నిరుపేద జంటలకు చేయూత

సండే స్పెషల్

- దాతల నుంచి సహకారం
- కేవలం రూపాయితో వివాహం
- పండితుల నుంచి బంధువుల భోజనాల ఖర్చు వరకు ..
- ఆదర్శంగా నిలుస్తున్న 'రూపాయి ఫౌండేషన్'



వివాహబంధంతో ఒక్కటైన జంట

ఖర్చులు భరించే స్థోమత లేని అనాథలు, దివ్యాంగులు, పేద వధూ వరులను కేవలం ఒక్క రూపాయితో ఒక్కటి చేస్తోంది సరూర్‌నగర్ డివిజన్‌లోని శారదనగర్ కాలనీకి చెందిన రూపాయి ఫౌండేషన్. ఎంతో మందిని ఒక్కటి చేసి ఆదర్శంగా నిలుస్తోంది. సరూర్‌నగర్‌కు చెందిన నాగమళ్ల అనిల్, అరుణ దంపతులు. పేదలకు తమవంతు చేయూతను అందించాలనే ఆలోచనతో 2007లో 'అమ్మ ఫౌండేషన్'కు అంకురార్పణ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన పేదలు, దివ్యాంగులు, అనాథ జంటలకు వివాహం చేసి ఒక్కటి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళసూత్రాలు, మెట్టెలు, నూతన వస్త్రాలు సమకూర్చడం మొదలు పెళ్లికి ఆసీనులయ్యే బంధు మిత్రులకు భోజనాలు వడ్డించే వరకు ఖర్చు భరిస్తున్నారు. పెళ్లిళ్లే కాదు.. సామూహిక సీమంతాలు, నామకరణాలు కూడా చేస్తున్నారు.

ఒక్కటైన జంటలెన్నో..

పెరిగిన ఖర్చుల నేపథ్యంలో వివాహాలను జరిపించడం ఫౌండేషన్‌కు భారంగా మారింది. దాతల సహకారం కోసం ఈ ఏడాది జనవరి 2న 'రూపాయి' పేరుతో మరో ఫౌండేషన్ ప్రారంభించారు. ఒక్కో దాత నుంచి రూపాయి చొప్పున సేకరించి, వచ్చిన మొత్తాన్ని పేద జంటల పెళ్లి ఖర్చులకు ఉపయోగిస్తున్నారు. ఈ ఫౌండేషన్‌లో దాతలే సభ్యులుగా ఉన్నారు. ఒకరు డెకరేషన్, మరొకరు సన్నాయి, ఇంకొకరు పుస్తెమెట్టెలు.. భోజనాలు ఇలా ఎవరికి తోచిన సహకారం వారు చేస్తున్నారు. ఇప్పటి వరకు 108 జంటలను ఒక్కటి చేశారు. నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

ఎలా సంప్రదించాలంటే..

రూపాయి వివాహాల కోసం నిర్వాహకుడు అనిల్‌కు మార్‌గుప్తాను 92465 76070 నంబర్‌లో సంప్రదించాలి. అనాథలు, దివ్యాంగులు, నిరుపేదలు ఎవరైనా కులమతాలకు అతీతంగా సంప్రదించవచ్చు. ఇందుకు ఆన్‌లైన్‌లో రూపాయి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం సమాచారం ఇచ్చి సుమూహూర్తంలో వివాహం జరిపిస్తారు.

పెళ్లి అనగానే ఖరీదైన బంగారు ఆభరణాలు.. ఆ'కట్టుకునే' నూతన వస్త్రాలు.. విలాసవంతమైన ఫంక్షన్ హాళ్లు.. భారీ డెకరేషన్లు.. సంగీత్‌లు.. మంగళ స్నానాలు.. సినిమా షూటింగ్‌ను తలదన్నే ఫొటో షూట్ సెట్టింగ్‌లు.. ఆడంబరంగా బరాత్‌లు.. తీరొక్క రుచులతో పసందైన విందు భోజనాలు.. రిటర్న్ గిఫ్ట్‌లు.. బంధు'ఘనం' సందడి.. ఇవే గుర్తుకువస్తాయి కదూ.. స్థోమతను బట్టి ఎవరికి వారు ఖర్చుకు వెనకాడకుండా చేసుకునే మహా సంబరం. మరి ఆర్థిక స్థోమత లేని వారి పరిస్థితి ఏమిటి..? అలాంటి వారి కోసమే మేమున్నాం అంటోంది 'రూపాయి ఫౌండేషన్'.. ఒకే ఒక్కరూ పాయితో జంటలను ఏకం చేస్తోంది.

– హుడాకాంప్లెక్స్

అలా మొదలైంది..



నాకు స్క్రీన్ ప్రింటింగ్ దుకాణం ఉండేది. ఒక అడ్వకేట్‌కి విజిటింగ్ కార్డులు ముద్రించి ఇచ్చేందుకు ఇంటికి వెళ్లాను. అక్కడ ఓ పేద విద్యార్థి వార్షిక ఫీజు చెల్లించలేని స్థితిలో కనిపించాడు. ఓ మంచి పని చేయాలని నాకు న్యాయవాది సూచించాడు. వెంటనే ఆ విద్యార్థి ఫీజు చెల్లించా. ఆ తర్వాత పేదలను ఆదుకోవాలని నిర్ణయించుకున్నా. తొలుత అమ్మ ఫౌండేషన్, ఆ తర్వాత రూపాయి ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. మేం చేస్తున్న సేవలు చూసి దాతలు ముందుకు వచ్చారు. ఎవరికి తోచిన సాయం వారు చేస్తున్నారు.

– అనిల్‌కుమార్‌గుప్తా, సరూర్‌నగర్

పెళ్లి పందిళ్లు వేస్తా



రూపాయి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా నిర్వహించే వివాహ, ఇతర శుభ కార్యాలకు నా వంతుగా సేవలు అందిస్తున్నా. పైసా తీసుకోకుండా పెళ్లి పందిరిని సిద్ధం చేస్తున్నా. పేద, మధ్య తరగతి వర్గాలకు చేయూతను అందించాలనేది నా తపన.

– లక్ష్మణ్, డెకరేషన్ దాత

ఘనంగా పెళ్లి జరిపించారు



అమ్మ ఉన్నా మా జీవితాలు అంతంత మాత్రమే. నాన్న బతికిఉన్నా ఇంత మంచిగా పెళ్లి చేసే వారు కాదు. రూపాయితో రిజిస్ట్రేషన్ చేసుకున్నా. పెళ్లి బట్టలు, బంగారు తాళి, వెండి మెట్టెలతో పాటు వంట పాత్రలు అందజేశారు. బంధుమిత్రులకు భోజనాలు సమకూర్చారు. ఘనంగా వివాహం జరిపించారు. నా భర్త మెకానిక్ షాప్‌లో పని చేస్తున్నాడు. ఈ వివాహ వేడుక మా ఇద్దరికీ ఎంతో ఆనందంగా ఉంది. రూపాయి పెళ్లి దాతలకు కృతజ్ఞతలు. జీవితాంతం రుణపడి ఉంటాం.

– నాగలక్ష్మి, మలక్‌పేట

మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ❖ ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నంరూరల్: మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణపై సీఐ రాఘవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ విభాగాల పనితీరు, ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి.. నేరాలను అరికట్టడం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల విషయంలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములమవుదాం

హైదరాబాద్ యాంటీ నార్కోటిక్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి

చేవెళ్ల: డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని హైదరాబాద్ యాంటీ నార్కోటిక్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం పోలీసశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, నష్టాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, అప్పుడే వాటికి దూరంగా ఉంటారని తెలిపారు. చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన వయసులో మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం మొత్తం నాశనం అవుతుందన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను బాధపెట్టిన వారవుతారని గుర్తుంచుకోవాలన్నారు. డ్రగ్స్ వాడకంతో జరిగే నష్టం, వాడిన వారు ఎలా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారో స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. ఎవరైనా సరే డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిసినా, అందులోకి లాగేందుకు ప్రయత్నించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసులు వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములం అవుతామని.. డ్రగ్స్ జోలికివెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటి నార్కోటిక్ సీఐలు శ్రీనివాస్‌రావు, గోపి, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ నిర్మూలన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

మరో విద్యార్థికి తీవ్ర గాయాలు



భరత్‌కుమార్ మృతదేహం

శంకర్‌పల్లి: ఓ వాహనం అతివేగం.. విద్యార్థి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. మరో విద్యార్థిని ఆస్పత్రి పాలు చేసింది. రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం శేరిగూడ గ్రామానికి చెందిన భరత్ కుమార్ (15), చరణ్ శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. శనివారం ప్రత్యేక తరగతులు ముగించుకొని బైక్ మీద ఇంటికి వెళ్తున్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్ శివారులో ఉండగా.. ముందు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న విద్యార్థుల బైక్ అదుపు తప్పింది. దీంతో వారు కారుని బలంగా ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న భరత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న చరణ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.



❖ **అర్థం చేసుకోండి**

టీజీఎస్పీ బెటాలియన్ పోలీసుల కుటుంబసభ్యులు శనివారం రోడ్డెక్కారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ప్రతిరోజు ఇలాగే రోడ్లపైకి వస్తామంటూ హెచ్చరించారు. 'ఏక్ స్టేట్, ఏక్ పోలీస్.. టీజీఎస్పీ హటావో, ఏక్ పోలీస్ బనావో' అంటూ నినాదాలతో హోరెత్తించారు. – ఇబ్రహీంపట్నం

'సహకారం'లో స్వాహాల గుర్తింపు!

- గ్యారంటీ లేకుండా రుణాల మంజూరు
- కందుకూరు డీసీసీబీలో రట్టయిన అక్రమాల గుట్టు
- ఇప్పటికే మేనేజర్‌పై వేటు.. కేసు నమోదుకు సిఫార్సు
- బదిలీపై వెళ్లాల్సిందిగా కార్యదర్శికి పాలకవర్గం హుకూం
- 'సాక్షి' కథనానికి స్పందన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సహకార బ్యాంకులో చోటు చేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇంటి నిర్మాణం, వాహనాల కొనుగోలు, వ్యాపార పెట్టుబడి, వ్యక్తిగత రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, మార్టిగేజ్ రుణాల మంజూరీలో బ్యాంకు మేనేజర్లు, కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేలింది. కందుకూరు డీసీసీబీలో ఎలాంటి గ్యారంటీలు లేకుండా బినామీల పేరుతో రూ.43 లక్షలకుపైగా రుణాలు మంజూరు చేసి, స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇప్పటికే బ్యాంకు మేనేజర్‌పై డీసీసీబీ వేటు వేసింది. ఈ స్వాహా కార్యానికి పాల్పడిన మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నిర్ణయించి పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. 'స్వాహాకారం' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే అంశంపై కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. చైర్మన్ సహా సభ్యులు పాల్గొన్నారు. రుణాల మంజూరు పేరుతో బ్యాంక్ మేనేజర్ సహా పీఏసీఎస్ కార్యదర్శి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. కార్యదర్శిని తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డీసీసీబీ సీఈఓకు విజ్ఞప్తి చేశారు. కార్యదర్శి 27 ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయారని, ఆయన్ను తక్షణం బదిలీ చేయాలని పట్టుబట్టారు. అప్పటికే ఆయన తనను మరో చోటికి బదిలీ చేయాలని కేంద్ర కార్యాలయానికి రిక్వెస్ట్ పెట్టడం, కార్యవర్గం ఆమెద ముద్ర వేయడం చకచకా జరిగిపోయాయి.

దివాలా అంచున బ్యాంకులు

జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా, వీటిలో 1,66,105 మంది సభ్యులు ఉన్నారు. వీటిలో ఏటా రూ.374 కోట్ల టర్నోవర్ నమోదవుతోంది. ఏడాదికి రూ.25 కోట్లకుపైగా టర్నోవర్‌ను కలిగిన ఉన్న (కందుకూరు, తుర్కయంజాల్, బాటసింగారం, మంచాల, యాచారం)పీఏసీఎస్‌లను 'ఎ' గ్రేడ్ జాబితాలో చూపించారు. అంతకంటే తక్కువ టర్నోవర్ కలిగి ఉన్న వాటిని (కొందుర్గు, ఉప్పరిగూడ, చేగూరు, మొయినాబాద్, ఆలూరు, గుండాల్, షాబాద్, మహేశ్వరం)'బి' గ్రేడ్ జాబితాలో చూపారు. రుణాల మంజూరు, రికవరీ విషయంలో 50 శాతం కంటే తక్కువ కలెక్షన్ ఉన్న మెకిల, భాగ్యనగర్, చిన్న గోల్కొండ, మల్కారం, పాలమాకుల, బండ్లగూడ, నార్సింగి, రాయదుర్గం, హైదర్షకోట్, చేవెళ్ల, ముడిమ్యాల, నందిగామ, కొత్తపేట, మేకగూడ, షాద్‌నగర్, హయత్‌నగర్, పటేల్‌గూడ, పాల్కంపల్లి, తలకొండపల్లి, మాడ్గుల పీఏసీఎస్‌లను 'సి' గ్రేడ్ జాబితాలో చూపారు. చైర్మన్లు, బ్యాంకు మేనేజర్లు, కార్యదర్శులు కలిసి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. తక్కువ వడ్డీకి రైతులకు రుణాలు మంజూరు చేయాల్సిన అధికారులు.. కమీషన్లు ఎక్కువ ఇచ్చే గ్యారంటీ లేని అనర్హులకు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు సమాచారం. తలాపాపం తిలా పిడికెడు అన్నట్లు లోన్ల ప్రాసెస్ కోసం రైతులు, ఇతర రుణగ్రస్తుల నుంచి వసూలు చేసే కమీషన్లను ఈ ముగ్గురు కలిసి పంచుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. పరోక్షంగా వీరు బ్యాంకులు ఆర్థికంగా దివాలా తీయడానికి కారణమవుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా బ్యాంకుల్లో తనిఖీలు నిర్వహించి, లోన్ల మంజూరు, రికవరీలపై దృష్టిసారించాల్సిన డీసీసీబీ కేంద్ర బ్యాంకు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం కూడా వారికి వరంగా మారుతోంది.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్లలో గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. త్వరలోనే చేవెళ్లలో నూతన గ్రంథాలయ అధునాతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలోని పాత గ్రంథాలయాన్ని పరిశీలించారు. నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం ముందున్న పాత క్వార్టర్స్ స్థలం ఎంతో బాగుందని, ఇక్కడే అధునాతన సౌకర్యాలతో ఉండే గ్రంథాలయ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇప్పుడు వచ్చిన నిధులకు ఆదనంగా మరికొన్ని నిధులు కేటాయించి ఇక్కడే మంచి గ్రంథాలయ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులు ఎస్.వసంతం, జిల్లా నాయకుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక నిధులు

షాబాద్: గ్రంథాలయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి, విద్యా వెలుగులకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని శనివారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ మనోజ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు షాబాద్ గ్రంథాలయం చుట్టూ ప్రహరీ నిర్మించి వీలైనంత త్వరగా ప్రారంభిస్తామన్నారు. కొన్ని రోజులుగా అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, అన్వర్, అక్తర్‌పాషా, సుభాష్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, జానీ, కృష్ణ, గారీశ్వర్, సత్యనారాయణ, కిషోర్‌నాయక్, ప్రశాంత్, జలీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వెల్జాల్ విద్యార్థులు

తలకొండపల్లి: 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండల పరిధిలోని వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ పరమేష్ శనివారం తెలిపారు. ఈ నెల 13న సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలికల ఖోఖో క్రీడా పోటీల్లో కె.స్పందన, ఎ.భవాని ఎంపికయ్యారని పీడీ చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో చాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం నసీమ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల స్వీపర్ బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల పనులకు వెళ్తున్నాని చెప్పిన స్వీపర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్(43), లలిత దంపతులు. లలిత కూలీ పనులకు వెళ్తుండగా రమేశ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతున్నారు. దీంతో రమేశ్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే ఉదయం పాఠశాలకు వెళ్తున్నాని చెప్పిన ఆయన మనస్తాపానికి గురైన రమేశ్ గ్రామం సమీపంలోని రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో రమేశ్ తల, మొండం వేరు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు రమేశ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ వెంకట్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

రుద్రాక్ష, విభూతి ఇచ్చి..

- విశ్రాంత ఉపాధ్యాయుడి ఉంగరం తస్కరణ
- నలుగురు నిందితులకు రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

యాచారం: సాధువుల వేషధారణతో వచ్చిన నలుగురు వ్యక్తులు ఓ రిటైర్డ్ టీచర్‌కు రుద్రాక్ష, విభూతి, ఇచ్చి బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం .. గుజరాత్ రాష్ట్రానికి చెందిన కవార్నాథ్, సామ్‌నాథ్, పర్దేశినాథ్, ప్రేమ్‌నాథ్ శుక్రవారం సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద తక్కళ్లపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ దెంది మాదవరెడ్డిని కలిశారు. సమీపంలో ఆలయాలు ఉంటే చెప్పాలని కోరారు. అయన్ను మాటల్లో పెట్టి ఓ రుద్రాక్ష, విభూతి ఇచ్చారు. ఉంగరం ఇస్తే పూజ చేసి ఇస్తామని నమ్మించారు. చేతికున్న ఉంగరం ఇవ్వగానే వారు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో ఆ విశ్రాంత ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మాల్ చెక్‌పోస్ట్ వద్ద నలుగురు సాధువులు సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే ఉంగరం దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యాచరణ

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి



ఆమనగల్లు: ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని నాగర్‌కర్నూల్ ఎంపీ, పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డా.మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రుణమేళా కార్యక్రమానికి వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేను కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. యువత నైపుణ్యశిక్షణ పొంది ప్రపంచ స్థాయిలో రాణించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయమని చెప్పారు. విపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఖలీల్, మల్లయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ కేంద్రాలు

కడ్తాల్: యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం వారు అచ్చంపేటకు వెళ్తూ కడ్తాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికాయి. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో అవగాహన కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ పరిధిలో భారీ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు యత్నిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాములుగౌడ్, భాస్కర్‌రెడ్డి, బీక్యా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు లక్పతినాయక్, మల్లేశ్‌గౌడ్, భిక్షపతి, సత్యం,యాదయ్య, శేఖర్‌గౌడ్, నర్సింహ, నరేశ్, రాజేశ్, శ్రీకాంత్, ఇమ్రాన్, శ్రీను, సురేశ్, సేవ్యా, రాంచందర్, మల్లయ్య ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బాలరాజ్ (ఫైల్)

కేశంపేట: పొలానికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కాకునూర్‌లో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌గౌడ్(70) తన వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం పొలానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తుండగా జడ్చర్ల మండలం గంగాపూర్ లో వృద్ధుడు కనిపించినట్లు ఓ హోటల్ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. అక్కడ వెతికినా వృద్ధుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆయన కుమారుడు శివశంకర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీఎస్‌పీ ప్రధాన కార్యదర్శి నియామకం

షాబాద్: తెలంగాణ సోషలిస్ట్ పార్టీ (టీఎస్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు నియమితులయ్యారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా పూర్తి చేస్తానన్నారు.